సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 23 । జనవరి । 2023



వెండి చీరకు విరాళం

తాడేపల్లిగూడెం రూరల్: ముత్యాలంబపురంలో శ్రీముత్యాలమ్మ వెండి చీర కోసం యర్రా సూర్యతేజ-అలేఖ్య దంపతులు రూ.11,120లు విరాళంగా అందజేశారు.



నిత్యాన్నదానానికి విరాళం

పాలకొల్లు సెంట్రల్ : క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదానం నిమిత్తం దాత పట్నాల రామారావు రూ.10 వేలు ట్రస్ట్ బోర్డు చైర్మన్‌కు అందజేశారు.



వైభవంగా కల్యాణోత్సవం

జంగారెడ్డిగూడెం: పారిజాతగిరి ఆలయంలో ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసునికి కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సమగ్ర కుల గణన చేపట్టాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: త్వరలో దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జన గణనలో సమగ్ర కుల గణన చేపట్టి దేశ వ్యాప్తంగా ఉన్న బహుజనుల లెక్కలు తేల్చాలని బీసీ చైతన్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాలులో బీసీ చైతన్య వేదిక ఆధ్వర్యంలో బీసీ చైతన్య వేదిక రాష్ట్ర కార్యదర్శి చినిమిల్లి గణపతి రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడారు. బీసీ జనాభా ఎంత మంది ఉన్నారో సరైన సమాచారం లేకపోవడం వల్ల ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు పొందలేకపోతున్నారన్నారు. బహుజనులు రాజ్యాధికారం సాధించే దిశగా చైతన్యవంతులు కావాలని కోరారు. ఎమ్మెల్సీ అంగర రామమోహన్, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం బహుజనులకు రాజ్యాంగ పదవులు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ప్రతీ బహుజనుడు విద్యాపరంగా అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్, రౌండ్ టేబుల్ సమావేశం ఆర్గనైజర్లు బొక్కా రమాకాంత్, కొప్పర్తి మురళీకృష్ణ, గుగ్గిలపు రామకృష్ణ, కుక్కల యుగంధర్, హైకోర్టు న్యాయవాది కోళ్ల ఈశ్వరప్రసాద్, సామాజిక కార్యకర్త షేక్ హుస్సేన్, చిట్టూరి ఏడుకొండలు, కోడి విజయభాస్కర్, కడలి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌కు ఎంపికలు

జంగారెడ్డిగూడెం: ఈ నెల 25న అండర్-14, అండర్-17 బాల బాలికల కరాటే ఎంపికలు ఏలూరు ఇండోర్ స్టేడియం నందు నిర్వహిస్తారని జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రెటరీ డి. రాజేంద్రప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఇండోర్ స్టేడియంలో రిపోర్ట్ చేయాలని, ఆధార్ కార్డును తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ 9866877776, 9440043108 ను సంప్రదించాలన్నారు.


వాసవీమాతకు లడ్డూలతో అలంకరణ



పెనుగొండలో మూలవిరాట్ వాసవీ మాతకు లడ్డులతో అలంకరణ

పెనుగొండ: ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని సందర్భంగా ఆదివారం పెనుగొండలోని మూలవిరాట్ వాసవీ మాతను తమిళనాడు కోయంబత్తూరు తిరుప్పవి కమిటీ ఆధ్వర్యంలో లడ్డూలతో అలంకరించారు. నగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం ఆదివారం తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి అర్చకులు కోట గణేష్ నగరేశ్వరస్వామికి అభిషేకాలు, వాసవీ మాతకు పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం దంపతుల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి జీఎస్ఎస్ శ్రీనివాస్ పర్యవేక్షించారు.

సీఎంకు కృతజ్ఞతలు



సాక్షి, భీమవరం: ఎస్సీ ఎస్టీ ఉపప్రణాళిక చట్టాన్ని మరో పదేళ్లు పెంచిన సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఎస్సీ ఎస్టీలు ఎంతో రుణపడి ఉన్నారని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 195 సంఘాలు కలిపి ఉద్యమం చేసి ఎస్సీ ఎస్టీలకు చట్టాన్ని సాధించాయని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాబోయే 10 సంవత్సరాలు కాలపరిమితిని పెంచినందుకు ప్రత్యేకంగా దళిత సంఘాలు, ఎస్టీ సంఘాలు హర్షిస్తున్నాయని చెప్పారు. గడువు జనవరి 23తో ముగుస్తుందని దాన్ని గమనించిన ముఖ్యమంత్రి మరో పది సంవత్సరాలు పెంచినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

వైద్యం భేష్

- జిల్లాలో 3 సీహెచ్‌సీల అప్‌గ్రేడ్‌కు చర్యలు
- ఆకివీడు, ఆచంట, పెనుగొండ సీహెచ్‌సీల అభివృద్ధి
- ప్రభుత్వాసుపత్రుల్లోనూ కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు
- రోజురోజుకు పెరుగుతున్న అవుట్ పేషెంట్లు

ఆకివీడు: ప్రభుత్వ దవాఖానాలు ఆధునిక హంగులతో సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రభుత్వ ఆసుపత్రులు అన్ని హంగులతో అభివృద్ధి చెందాయి. సేవా భావంతో వైద్యులు పూర్తి స్థాయిలో సేవలందిస్తున్నారు. తాజాగా జిల్లాలో మూడు 30 పడకల సీహెచ్‌సీల్ని 50 పడకలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నారు. ఆకివీడు, ఆచంట, పెనుగొండ సీహెచ్‌సీల్ని ఆధునికీకరిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన పశ్చిమ గోదావరి జిల్లాలో 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మూడు సామాజిక ఆరోగ్య కేంద్రాలు, నాలుగు ఏరియా ఆసుపత్రులు, 3 సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. 150 పడకల ఆసుపత్రిగా ఉన్న తణుకు ఆసుపత్రి జిల్లా కేంద్ర ఆసుపత్రిగా సేవలందిస్తుంది. ఇవి కాకుండా పట్టణ కేంద్రాల్లో ఆరోగ్య కేంద్రాలు పనిచేస్తున్నాయి. అన్ని ఆసుపత్రుల్లో అవుట్ పేషెంట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇటీవల అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రుల్లో పూర్తి స్థాయిలో వైద్యుల్ని ప్రభుత్వం నియమించింది. అన్ని ఆసుపత్రుల్లో మందుల్ని అందుబాటులో ఉంచింది. 104 వాహనం ద్వారా మందుల్ని గ్రామాలకు వెళ్లి రోగులకు అందజేస్తున్నారు.

సీహెచ్‌సీల అభివృద్ధికి చర్యలు

పశ్చిమ గోదావరి జిల్లాలో వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో 3 సామాజిక ఆరోగ్యం కేంద్రాల్ని అప్‌గ్రేడ్ చేసి 50 పడకల ఆసుపత్రులుగా అభివృద్ధి చేస్తున్నారు. ఆకివీడులో రూ.2 కోట్ల వ్యయంతో, పెనుగొండ, ఆచంటలలో రూ. 50 లక్షల వ్యయంతో నూతన భవనాల్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే నర్సాపురం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, భీమవరంలో 100 పడకల ఆసుపత్రుల ద్వారా రోగులకు సేవలందిస్తుంటే , భీమవరంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దాతృత్వంతో కేటాయించిన స్థలంలో మరో 50 పడకల ఆసుపత్రి నిర్మాణం కొనసాగుతోంది. ఆకివీడు సీహెచ్‌సీ అప్‌గ్రేడ్‌తో పాటు రక్త నిల్వ యూనిట్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. వేలాది మంది యువత రక్తదానం చేసేందుకు ముందుకు వస్తున్నారు. దీంతో ఆకివీడు ప్రాంతంలో రక్తనిల్వ యూనిట్ ఏర్పాటు ద్వారా రక్తం అందుబాటులోకి తీసుకురానున్నారు.



ఆకివీడు సీహెచ్‌సీ ప్రాంగణంలో నిర్మిస్తున్న 50 పడకల ఆసుపత్రి

ఫ్యామిలీ డాక్టర్ విధానంపై ప్రశంసలు

గ్రామాల్లో వైద్యం అందజేసేందుకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ప్రజల్ని విశేషంగా ఆకట్టుకుంటుంది. వైద్యుడు గ్రామంలోకి వచ్చి వైద్య సేవలందజేయడంతో రోగులు, వృద్ధులు, ఇతర వ్యాధిగ్రస్తులకు వైద్యం సత్వరం అందుతుంది. నెలకు రెండు సార్లు గ్రామంలోకి వైద్యుడు వెళ్లి 14 రకాల పరీక్షలతో, రోగులకు అందజేసేందుకు 67 రకాల మందుల్ని తీసుకువెళ్తున్నారు. రోగుల్ని పరీక్షించిన తరువాత అవసరమైతే ఆరోగ్యశ్రీకి రిఫర్ చేస్తున్నారు. నెలలో రెండు రోజులు ఆయా పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పిల్లల్ని పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేస్తున్నారు.

సీహెచ్‌సీల్ని అప్‌గ్రేడ్ చేస్తున్నాం



“ పశ్చిమ గోదావరి జిల్లాలో మూడు సామాజిక ఆరోగ్య కేంద్రాలు అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 30 పడకల నుంచి 50 పడకల ఆసుపత్రిగా ఆకివీడు, ఆచంట, పెనుగొండ ఆస్పత్రుల్ని అభివృద్ధి చేస్తున్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు, వైద్యులు అందుబాటులో ఉన్నారు.

-వీరాస్వామి, భీమవరం ఏరియా ఆసుపత్రి సూపరింటిండెంట్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం భేష్



ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు సంతృప్తిగా ఉన్నాయి. వైద్యులు, మందులు అందుబాటులో ఉండటంతో ఇబ్బందులు తొలగాయి. ఫ్యామిలీ డాక్టర్ వైద్యం చాలా బాగుంది. మందులు పూర్తి స్థాయిలో ఇవ్వడంతో ప్రవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేదు. 104 వాహనం ద్వారా కూడా మందులు టైంకు వస్తున్నాయి.

-జలస్తోత్రం పిచ్చియ్య, వ్యవసాయ కూలీ, సిద్ధాపురం, ఆకివీడు మండలం

రథసప్తమి ఉత్సవాలు ప్రారంభం



చంద్రప్రభ వాహనంపై ఊరేగుతున్న శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహ స్వామి

ఆగిరిపల్లి: జిల్లాలోని ఆగిరిపల్లిలో స్వయంభు శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహ స్వామివారి మాఘమాస రథసప్తమి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామివారికి ఉదయం నవ కలశ పంచామృత స్నపన, విశేష అష్టోత్తర శత రజిత తులసి దళార్చన, రాజ్యలక్ష్మీ అమ్మవారికి రజిత పుష్పార్చన, నీరాజన మంత్రపుష్పాలు నిర్వహించారు. రాత్రి 6.30 గంటలకు పెళ్లి కుమారుడి అలంకారంలో చంద్రప్రభ వాహనంపై కొలువుదీరిన స్వామికి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి గ్రామోత్సవం పెద్ద కొఠాయి(కళ్యాణ మండపం)కు చేరుకోగా భక్తులు దర్శించుకుని ఆధ్యాత్మికానందం పొందారు. కార్యక్రమాలను ఆలయ ఈవో ఎన్. భవాని పర్యవేక్షించగా, ఆలయ అర్చకులు వేదాంతం శేషబాబు, జి.అనంతకృష్ణలు పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

అర్చకుల సంక్షేమమే లక్ష్యం



ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్: అర్చకుల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, అదేవిధంగా అర్చకులు ఆలయాల పరిరక్షణ బాధ్యత వహించాలని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక మాగంటి కల్యాణ మండపంలో దేవదాయ శాఖ అర్చక ట్రైనింగ్ అకాడమీ ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు, తూర్పు గోదావరి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లాల అర్చకులకు ఆగమ శిక్షణా తరగతులు అవగాహన సదస్సును సమాఖ్య అధ్యక్షులు బాలగోపాల చక్రవర్తి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సదస్సుకు విచ్చేసిన మంత్రి కొట్టు మాట్లాడుతూ ఆలయాల పునరుద్ధరణకు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. మొదటివిడతగా 4,800 ఆలయాలను పునరుద్ధరించేందుకు కార్యాచరణ చేపట్టారన్నారు. రాష్ట్రంలో గ్రామాల్లో ఆలయాలను నిర్మించేందుకు కార్యాచరణ చేపట్టినట్లు చెప్పారు. ఆగమ విషయాలపై అవగాహన కల్పించేలా అర్చకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆలయాల్లో మధ్యాహ్న సమయం నుంచి దీనిపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆగమ శాస్త్రాలను వారసత్వంగా తమ పిల్లలకు నేర్పించాలని తెలిపారు. హిందూ ధర్మం భక్తి భావంతో కూడిందదన్నారు. దేశంలో హిందూ ధర్మ ప్రచార నిర్వహణ ప్రపంచానికి మార్గదర్శకంగా నిలవడం ముఖ్యమంత్రి సంకల్పమన్నారు. రాష్ట్ర సెక్రటేరియట్‌లో ప్రతీ మంగళవారం దేవదాయ శాఖకు సంబంధించి ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. చట్టాల్లో ఉన్న యాక్టులను వారికి సౌలభ్యంగా మార్చుకోవడంతో ప్రస్తుతం అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. శ్రీశైలం దేవస్థానం భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించామని తెలిపారు. అర్చకులు, దేవాలయాల అభివృద్ధికి జగన్ ప్రభుత్వం మరిన్ని సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం మంత్రి కొట్టు సత్యనారాయణను అర్చక సంఘాల నాయకులు సత్కరించారు.

అంకితభావంతో సేవలందించాలి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



వైఎస్సార్ సేవాదళ్ సమావేశంలో జిల్లా కన్వీనర్ వెంకట్రాయుడ్ని సత్కరిస్తున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్యే శ్రీనివాస్, గిరిధర్‌రెడ్డి

సాక్షి, భీమవరం : పార్టీకి, ప్రజలకు అంకితభావంతో సేవలందించాలనే లక్ష్యంతో వైఎస్సార్ సేవాదళ్ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అన్నారు. ఆదివారం భీమవరం పట్టణం రాయలం వద్ద నిర్వహించిన వైఎస్సార్ సేవాదళ్ ఉభయగోదావరి జిల్లాల మండల కన్వీనర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సేవాదళ్‌పై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టిపెట్టారని ప్రజలకు సేవచేయడాన్ని సేవాదళ్ సభ్యులు గురుతర బాధ్యతగా భావించాలన్నారు. నిస్వార్థంగా పార్టీ, ప్రజల కోసం పనిచేసే వైఎస్సార్ సీపీ శ్రేణులకు రానున్న కాలంలో మంచి భవిష్యత్తు ఉంటుందని కారుమూరి స్పష్టం చేశారు. భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి సేవాదళ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ప్రజలను చైతన్యం చేయడంలో సేవాదళ్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం ద్వారా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలకు విశ్వసనీయత తీసుకువచ్చారని స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీలు ఎల్లోమీడియా సహకారంతో దుష్ప్రచారం చేస్తున్నాయని దీనిని అడ్డుకోడానికి సేవాదళ్ కృషిచేయాలన్నారు. సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడమే రాజకీయ పార్టీల లక్ష్యమని అయితే కొన్ని రాజకీయ పార్టీలు దీనికి భిన్నంగా కుల, మతాలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుకుంటున్నాయని విమర్శించారు. ఎల్లో మీడియా దుష్ప్రచారం తిప్పికొట్టాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఉభయగోదావరి జిల్లాల సేవాదళ్ కన్వీనర్ చినిమిల్లి వెంకట్రాయుడు మాట్లాడుతూ పార్టీ ఆదేశాలకు అనుగుణంగా సేవాదళ్ పని చేస్తుందని ప్రస్తుతం మండల కన్వీనర్లు ఫిబ్రవరి నెలాఖరులోగా గ్రామ కన్వీనర్లను నియమించుకుని తద్వారా గ్రామానికి 10 మంది సేవాదళ్ సభ్యులను నియమిస్తామన్నారు.

ఉమ్మడి జిల్లాలో 8 వేల మంది నియామకం

ఉభయ గోదావరి జిల్లాల్లో 8 వేల మందికి పైగా సేవాదళ్ సభ్యులను నియమించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో ప్రమాణస్వీకారం చేయించేలా కార్యక్రమం రూపకల్పన చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఏది నిజం అనే కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తు ప్రతిపక్ష పార్టీలు, కొన్ని మీడియా సంస్థలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడతామని వివరించారు. అనంతరం జిల్లాలోని నలుమూల నుంచి వచ్చిన సేవాదళ్ మండల కన్వీనర్లను సత్కరించి జ్ఞాపికలు బహుకరించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, ఎంటీసీ చైర్మన్ పెండ్ర వీరన్న, వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంట్ మహిళా కన్వీనర్ గూడూరి ఉమాబాల, గాదిరాజు సుబ్బరాజు, ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.



తణుకులోని ఒక పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ రవిప్రకాశ్



భీమవరంలో పరీక్షా హాల్‌ను సరిచూసుకుంటున్న అభ్యర్థులు

ప్రశాంతంగా కానిస్టేబుల్ పరీక్ష



భీమవరంలో హాల్ టికెట్లు పరిశీలిస్తున్న దృశ్యం



భీమవరంలో క్యూలైన్‌లో అభ్యర్థులు



అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ రవిప్రకాష్



తాడేపల్లిగూడెంలో హాల్‌టికెట్ నెంబర్లు పరిశీలిస్తున్న అభ్యర్థులు

సాక్షి, భీమవరం: పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమ్స్ రాత పరీక్ష జిల్లాలో ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, వీరవాసరం ప్రాంతాల్లో పరీక్షలకు 40 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేయగా ఎస్పీ యు.రవిప్రకాష్ పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తుతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముగిసింది. పరీక్షకు 20,451 మంది దరఖాస్తు చేసుకోగా 17,255 మంది హాజరయ్యారు. ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు పరుగు పరుగున వచ్చి హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద నిబంధనలు పాటించేలా క్షేత్ర స్థాయిలో పోలీసు అధికారులు పర్యవేక్షించారు. భీమవరం డీఎన్నార్ కళాశాల సెంటర్ వద్ద ఎస్పీ రవిప్రకాష్ స్వయంగా అభ్యర్థుల హాల్‌టికెట్లు, గుర్తింపు కార్డులను పరిశీలించి పరీక్షా హాలులోకి పంపించారు. ఇతర పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులను పూర్తి స్థాయిలో తనిఖీ చేసి అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులు బారులు తీరారు. పరీక్షకు అనేకచోట్ల మహిళలు చంటి బిడ్డలతో హాజరయ్యారు. జిల్లాలోని 40 కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఎస్పీ రవిప్రకాష్ తెలిపారు. ఎక్కడా మాస్‌కాపీయింగ్ నమోదు కాలేదని చెప్పారు.

నేడు నర్సాపురంలో జిల్లా స్థాయి స్పందన

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం నరసాపురం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జనవరి 23న సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తారని కలెక్టరు పి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని డివిజనల్ కార్యాలయాలు, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలల్లోను స్పందన కార్యక్రమం యథావిధిగా నిర్వహిస్తారన్నారు. జిల్లా అధికారులందరూ ఉదయం 10 గంటలకు నరసాపురం మున్సిపల్ కార్యాలయం లో విధిగా హాజరుకావాలని కలెక్టర్ కోరారు. సోమవారం స్పందనకు వచ్చే ఫిర్యాదుదారులంతా తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు ధరించి సామాజిక దూరం పాటించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

ఉద్యాన వర్సిటీలో కౌన్సెలింగ్

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో బీఎస్సీ(హానర్సు)ప్రవేశం కోసం నాలుగో విడత కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్టు వర్సిటీ అధికారులు తెలిపారు. ఈ నెల 24వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు ఏపీఈఏపీసెట్-2022 ర్యాంకులను బట్టి ఈ కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. 2713 నుంచి 100079 వ ర్యాంకు వరకు వర్సిటీ పరిపాలనా భవనంలోని సమావేశం హాలులో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి కేటగిరీ వారీగా రిజర్వేషన్ల దామాషాకు అనుగుణంగా ఈ కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని అధికారులు తెలిపారు.

కొల్లేరులో ప్రజా చైతన్యం

- కట్టుబాట్లకు చెల్లుచీటి.. పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు
- పెద్దల ముసుగులో పెత్తందారీ వ్యవస్థకు చరమగీతం
- మార్పుదిశగా కొల్లేరు లంక గ్రామాల ప్రజల అడుగులు

కొల్లేరు లంక గ్రామాల్లో బంటా పెద్దలు చెప్పిందే వేదం. వీరిచ్చే తీర్పును మీరితే గ్రామ బహిష్కరణే. బాధితుల పక్షాన న్యాయం కొల్లేరు అలల్లో కలిసిపోయేది. ఇలా ప్రభుత్వానికి సమాంతర పాలన లంక గ్రామాల్లో దర్శనమిచ్చేది. ఇటువంటి గడ్డు పరిస్థితుల్లో నేడు కొల్లేరు గ్రామాల ప్రజల్లో మార్పు కనిపిస్తోంది. ప్రజల్లో చైతన్యం పెరిగి పెద్దల పెత్తనాన్ని ఎదిరించి పోలీస్‌స్టేషన్ గుమ్మాలను తొక్కుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొల్లేరు ప్రజలకు అండగా మారాయి.



ఇటీవల పోలీస్‌స్టేషన్‌ను ఎక్కువగా ఆశ్రయించిన కొల్లేటి గ్రామం నత్తగుల్లపాడు

కైకలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో 9 మండలాల్లో కొల్లేరు సరస్సు విస్తరించి ఉంది. జీవో 120 ప్రకారం 77వేల 138 ఎకరాలను కొల్లేరు అభయారణ్యంగా ప్రకటించారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా కొల్లేరు పరివాహక ప్రాంతం ఏలూరు జిల్లా పరిధిలోకి చేరింది. మొత్తం 9 మండలాల్లో 122 బెడ్, బెల్టు గ్రామాలు కొల్లేరు పరివాహక ప్రాంతాల్లో ఉన్నాయి. ఇక్కడ జనాభా 3.15 లక్షలు. ప్రధాన వృత్తి చేపల పెంపకం. మొత్తం 80 వేల కుటుంబాలకు చెందిన దాదాపు లక్షా 85 మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడి ప్రజలు నేడు స్వతంత్రంగా ఆలోచిస్తున్నారు.

బంటా పెద్దల పెత్తనం..

యుద్ధాల కారణంగా ఒడిశా తీరం నుంచి వడ్డెర కులానికి చెందిన కొన్ని కుటుంబాలు పూర్వం కొల్లేరు ప్రాంతానికి చేరాయి. చేపల వేట విషయంలో గొడవలు రావడంతో గ్రామ పెద్దల వ్యవస్థ ఇక్కడ పురుడుపోసుకుంది. గ్రామంలో 100 మందిని కలిపి బంటా అంటారు. బంటాకు ఒక పెద్ద ఉంటాడు. గ్రామంలో ఎన్ని బంటాలు ఉంటే అంత మంది పెద్దలు ఉంటారు. వీరందరికీ గ్రామ పెద్ద ఒడ్డీ నాయకుడిగా ఉంటాడు. దాదాపు 11 మంది పెద్దలు ఉంటారు. ఏడాదికి వీరు మారతారు. సర్పంచ్ ఉన్నప్పటికీ బంటా పెద్దలు చెప్పిందే చెల్లుబాటవుతుంది.



కొల్లేరు సరస్సులో దోనెలలో సంప్రదాయ వేట

వింత ఆచారాలు..

కొల్లేరు గ్రామాల్లో ఆచార వ్యవహారాలు ఆశ్చర్యాన్ని గొలుపుతాయి. వివాహాల విషయానికి వస్తే పెళ్లికుతూరికి ముందుగా కొంత నగదు పెళ్లికొడుకు ఇవ్వాలి. నిశ్చతార్థాన్ని ఇక్కడ 'చాపవేయడం' అంటారు. వివాహ సమయంలో ఇంటి ముందు గుంటను తీసి, అందులో నీరు పోసి దోనెల బొమ్మలను ఉంచుతారు. భార్యభర్తలు ప్రమాణం చేయాలి. వీరు విడిపోతే దానిని పెద్దల సమక్షంలో 'విడుదల' పేరుతో పంచాయతీ పెడతారు. సంసార జీవనం, సంతానాన్ని బట్టి ఇద్దరికీ తప్పులు వేస్తారు. కొన్ని ఆచారాలు మరుగున పడినా పెద్దల పంచాయతీ మాత్రం అలానే కొనసాగుతోంది.



చేపలు పట్టే మావులు అల్లుతున్న దృశ్యం

పెద్దలను కాదని... న్యాయం కోసం పోలీస్‌స్టేషన్లకు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. దీంతో కొల్లేరు గ్రామాలు స్వచ్ఛందంగా వైఎస్సార్ సంపూర్ణ గ్రామాలుగా ప్రకటించుకుంటున్నాయి. దీనికి తోడు ఇటీవల కొల్లేరు గ్రామాల నుంచి పోలీసుస్టేషన్లకు ఫిర్యాదులు పెద్ద ఎత్తున అందుతున్నాయి. మండవల్లి మండలం చింతపాడు, పెనుమాకలంక, నుచ్చుమిల్లి, కైకలూరు మండలం పెంచికలమర్రు, శృంగవరప్పాడు, నత్తగుళ్లపాడు, గుమ్మళ్లపాడు వంటి కొల్లేరు గ్రామాల నుంచి పెద్దలను కాదని ప్రజలు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఎస్సైలు రామకృష్ణ, చల్లా కృష్ణ పెద్దలకు పలు కేసులలో కౌన్సెలింగ్ అందిస్తున్నారు. తప్పు చేసిన పెద్దలపై సైతం కేసులు నమోదు చేస్తున్నారు.

ఆహ్వానించదగ్గ పరిణామం



కొల్లేరు గ్రామాల్లో గతంలో ఎటువంటి తప్పు జరిగినా నిజం చెప్పడానికి ఎవరూ ముందుకు వచ్చేవారు కాదు. అటువంటిది ఆయా గ్రామాల నుంచి ఫోన్లు వస్తున్నాయి. బాధితులు ధైర్యంగా ఫిర్యాదులు చేస్తున్నారు. జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాలతో కొల్లేరు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కొల్లేరు గ్రామాల్లో మార్పు ఆహ్వానించదగిన పరిణామం.

– ఎస్.రామకృష్ణ, మండవల్లి ఎస్సై

మార్పు కనిపిస్తోంది



కొల్లేరు గ్రామాల్లో యువత విద్యావంతులు కావడంతో గ్రామ కమిటీల్లో వారికి స్థానం దక్కుతోంది. పెద్దలు తప్పు చేస్తే వారిని ప్రశ్నించే స్థాయికి వారు ఎదిగారు. కొల్లేరులో పూర్వపు ఆచారాల్లో ఇప్పుడు మార్పు కనిపిస్తోంది. పూర్వం గ్రామంలోనే రచ్చబండలో తీర్పులు ఇవ్వగా, నేడు న్యాయం జరగకపోతే బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

– ఘంటసాల వెంకటేశ్వరరావు, కొల్లేరు నాయకులు, కొవ్వాడలంక

మానవత్వం చాటిన కలెక్టర్

- మతిస్థిమితం లేని వృద్ధుడి ఆరోగ్యస్థితిపై కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆరా
- చికిత్స అందించి వృద్ధాశ్రమంలో చేర్పించాలంటూ అధికారులకు ఆదేశం



ఆసుపత్రిలో వృద్ధుడి ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్న తహసీల్దార్ స్లీవజోజి, అధికారులు

జంగారెడ్డిగూడెం: రోడ్డున పడి మతిస్థిమితం లేని ఓ వృద్ధుడి ఆరోగ్య పరిస్థితిని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మానవత్వంతో స్పందించిన తీరుపై సర్వత్రా ప్రశంసిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. జంగారెడ్డిగూడెంలోని కొవ్వూరు రోడ్డు బస్సు స్టాప్ వద్ద అనారోగ్యంతో బాధపడుతూ, మతిస్థిమితం లేని ఓ వృద్ధుడిని చెత్త ట్రాక్టర్‌లో బతికుండగానే శనివారం శ్మశానవాటిక షెడ్ వద్దకు తరలిస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో ఓ పోస్ట్ హల్‌చల్ చేసింది. ఈ విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ప్రసన్న వె.ప్రసన్న వెంకటేష్ వెంటనే స్పందించి మునిసిపల్, పంచాయతీ అధికారులను సదరు స్థలానికి పంపించి దీనిపై తనకు అత్యవసర నివేదిక అందించాలని ఆదేశించారు. దీంతో అధికారులు ఉరుకులు పరుగులతో వృద్ధుడి వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. వృద్ధుడు కాకినాడకు చెందిన కోరుకొండ రామమోహనరావు అని, నాలుగు రోజులుగా బస్సు షెల్టర్ వద్ద ఏమీ తినకుండా, అనారోగ్యంతో బాధపడుతుండగా మున్సిపల్ సిబ్బంది అతనిని ఆసుపత్రిలో చేర్పించేందుకు ట్రాక్టర్‌లో తీసుకువెళుతున్నారని కలెక్టర్‌కు నివేదిక అందించారు. వెంటనే వృద్ధుడికి జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించాలని కలెక్టర్ వైద్య శాఖాధికారులను ఆదేశించారు. దీంతో రామమోహనరావును ఆసుపత్రిలో చేర్పించి శని, ఆదివారాల్లో చికిత్స అందించారు. ఆదివారం అతని ఆరోగ్య పరిస్థితిపై కలెక్టర్ ఆరా తీయగా, పూర్తిగా కోలుకున్నారని వైద్యులు ఆదివారం కలెక్టర్‌కు తెలియజేశారు. అనంతరం రామమోహనరావును వృద్ధాశ్రమంలో చేర్పించాలని కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ స్లీవజోజి, డీటీ రమేష్, సామాజిక కార్యకర్త ధనకుమార్, వృద్ధాశ్రమం ప్రతినిధి జయవరపు శేఖర్‌లతో కలిసి ఆదివారం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడిని పరామర్శించి, నూతన వస్త్రాలను అందించారు. కోలుకున్న తర్వాత స్థానిక సీతామహాలక్ష్మి వృద్ధాశ్రమానికి వృద్ధుడిని తరలించేలా ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ చొరవ చూపి వృద్ధుడి ప్రాణాన్ని కాపాడిన తీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

గడపగడపకు పథకాల లబ్ధి



తాడేపల్లిగూడెం రూరల్: కడియద్ద గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తణుకు అర్బన్: తణుకు 18వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

ఆకట్టుకున్న సత్యహరిశ్చంద్ర నాటకం



సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శనలోని ఓ దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారి వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన పలు కళా ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు షణ్ముక డీజే కోలాటం మట్టపర్రు వారి కోలాట ప్రదర్శన నిర్వహించారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఇళ్ల సత్యనారాయణ భీమవరం ఆధ్వర్యంలో భజన, నాలుగు గంటలకు ఎంవీ సుధారాణి బృందంతో శ్రీఅమ్మవారి సంకీర్తనలు, సాయంత్రం 5 గంటలకు ఉమా సోమేశ్వర కూచిపూడి నాట్య కళాక్షేత్రం భీమవరం ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన, రాత్రి 7 గంటలకు శ్రీమావుళ్లమ్మ నాట్యమండలి ఆధ్వర్యంలో ప్రదర్శించిన సత్య హరిశ్చంద్ర నాటకం అలరించింది. ఈ నాటకంలో అందరూ మహిళా కళాకారులే ఉండటం విశేషం. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ కళా ప్రదర్శనలను తిలకించారు. నీరుల్లికూరగాయ పండ్ల వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటి సభ్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి ఉత్సవాల్లో నేడు

శ్రీమావుళ్లమ్మ అమ్మవారి వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు అభయ ఆంజనేయ హరే శ్రీనివాస భజన సమాజం భీమవరం వారిచే భజన, 4 గంటలకు శ్రీ వెంకటేశ్వర భక్త సమాజం వంకాయలపాలెం వారిచే భజన, సాయంత్రం 5 గంటలకు శ్రీమావుళ్లమ్మ ఆర్ట్స్, సూర్యోదయ ఆర్ట్స్ భీమవరం వారిచే విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు నాటకం ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా రాత్రి 8 గంటలకు సత్య ఆర్కెస్ట్రా అత్తిలి వారిచే సినీ సంగీత విభావరి నిర్వహిస్తారు.

అసంబద్ధంగా ఉపాధ్యాయుల సర్దుబాటు



ఫ్యాప్టో సమావేశంలో పాల్గొన్న వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రస్తుతం విద్యాశాఖలో జరుగుతున్న పని సర్దుబాటు అసంబద్ధంగా, అభ్యంతరకరంగా ఉన్నాయని ఫ్యాప్టో నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో ఫ్యాప్టో జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం పని సర్దుబాటులో భాగంగా విడుదలైన జాబితాలో ఉపాధ్యాయుల పని సర్దుబాటు విధానం వారిని మానసికంగా కుంగదీసిందన్నారు. వారికి కౌన్సెలింగ్ జరిపి సీనియర్స్‌కి, జూనియర్స్‌కు మధ్య అంతరం తగ్గిస్తూ న్యాయం చేయాలని కోరారు. సర్‌ప్లస్‌గా తేలిన టీచర్లను అన్ని సబ్జెక్టుల్లో క్యాడర్ సీనియారిటీ జాబితా తయారు చేసిన అనంతరం వారికి కౌన్సెలింగ్ జరపాలని ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలను సందర్శించే అధికారులు విద్యావ్యవస్థను బలోపేతం చేసే విధంగా ఉండాలే తప్ప షోకాజు నోటీసులు, సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసే విధానం సరికాదని ఖండించారు. లోటుపాట్లు సరిచేసుకునే అవకాశాలు ఆయా టీచర్లకు, ప్రధానోపాధ్యాయులకు ఇవ్వాలని కోరారు. పని సర్దుబాటుపై వెంటనే కో–ఆర్డినేషన్ సమావేశం జరిపి అందరికీ ఆమోదయోగ్యంగా కౌన్సెలింగ్ జరపాలని కోరారు. ఈ సమావేశంలో ఫ్యాప్టో జిల్లా నాయకులు పీబీవీఎస్ఎల్ నారాయణ, జీ వెంకటేశ్వరరావు, ఎం.ఆదినారాయణ, సయ్యద్ జిలానీ, పీవీ నరసింహరావు, ఎస్‌కే రంగావలి, పీఎల్‌వీ రామారావు, ఆర్.రవికుమార్, సాయిరాజు భల్లం పాల్గొన్నారు.

నేటి నుంచి 'విర్డ్'లో ప్రత్యేక వైద్య సేవలు

ద్వారకాతిరుమల: శ్రీవేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ రిహాబిలిటేషన్ ఫర్ ద డిజేబుల్డ్ (విర్డ్) ఆస్పత్రిలో సోమవారం నుంచి ప్రత్యేక వైద్య సేవలు ప్రారంభిస్తున్నట్టు ఆస్పత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు చెప్పారు. జనరల్, చిన్నపిల్లలు, ఊపిరితిత్తులు, చర్మవ్యాధులకు సంబంధించిన వైద్య సేవలను ఏలూరు ఆశ్రం ఆస్పత్రి వైద్యుల ద్వారా రోగులకు అందిస్తామన్నారు. అందులో భాగంగా వైద్యులు ప్రతి రోజూ విర్డ్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓపీ నిర్వహిస్తారన్నారు. ఈ వైద్య సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని సుధాకరరావు కోరారు.

పేకాట శిబిరంపై ఎస్‌ఈబీ దాడి

12 మంది అరెస్ట్, రూ.91,350 నగదు స్వాధీనం

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా వ్యాప్తంగా మద్యం, ఇసుక అక్రమ రవాణాను నిరోధించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టామని ఎస్‌ఈబీ సీఐ ప్రసాద్‌కుమార్ చెప్పారు. ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ, ఎస్‌ఈబీ అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు ఆదేశాల మేరకు జిల్లాలో ఆకస్మిక దాడులు చేస్తున్నామన్నారు. ఏలూరు ఎస్‌ఈబీ సీఐ శ్రీనివాసరెడ్డితో కలిసి ఏలూరు టూటౌన్ స్టేషన్ పరిధిలోని పత్తేబాద ప్రాంతంలో పేకాట శిబిరంపై ఆదివారం సాయంత్రం దాడి చేసి 12 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశామని చెప్పారు. వీరి నుంచి రూ.91350 నగదు, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని టూటౌన్ పోలీసులకు అప్పగించామని తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

లింగపాలెం మండలం మఠంగూడెంలో ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేయగా, ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఈబీ సీఐ ప్రసాద్‌కుమార్ చెప్పారు. నిందితులను, ట్రాక్టర్లను తదుపరి చర్యల కోసం ధర్మాజీగూడెం పోలీస్‌స్టేషనకు అప్పగించామని తెలిపారు.

జీరో టిల్లేజ్.. నో వర్రీస్



చింతలపూడిలో జీరో టిల్లేజ్ విధానంలో వేసిన మొక్కజొన్న పంట



పామాయిల్ తోటలో అంతర పంటగా వేసిన మొక్కజొన్న పంట

- రబీలో ఆరుతడి పంటలకు మేలు
- రైతుకు ఖర్చు, సమయం ఆదా
- వరి తరువాత మొక్కజొన్న సాగుకు అత్యధిక ప్రోత్సాహం



పాడి - పంట

చింతలపూడి: మొక్కజొన్నను మనం ఆహారంగానే కాకుండా దాణా రూపంలో, పశువుల మేతగా, వివిధ పరిశ్రమల్లో ముడి సరుకుగాను ఉపయోగిస్తున్నాం. రబీ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా చెరువుల్లో నీరు ఉండదు. భూగర్భ జలాలు అడుగంటి పోతాయి. ఈ నేపథ్యంలో నీటి ఆధారిత పంటలు వేసి నష్టపోవడం కన్నా ఆరుతడి పంటలు వేసుకుని లాభాలు పొందడం మేలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. ఇందుకోసం జీరో టిల్లేజ్ విధానం అవలంబించాలని చెబుతున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 48 వేల హెక్టార్లలో రైతులు ఖరీఫ్, రబీ సీజన్లలో మొక్కజొన్న పంట సాగు చేస్తూ ఏటా 4.40 లక్షల టన్నుల దిగుబడి సాధిస్తున్నారు. ఆరుతడి పంటలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో జిల్లాలోని మెట్ట ప్రాంతంలో చింతలపూడి సబ్ డివిజన్‌లో 2,080 ఎకరాల్లో జీరో టిల్లేజ్ సాగు విధానంలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. వరి తరువాత ఖరీఫ్, రబీ సీజన్లలో వ్యవసాయ శాఖ మొక్కజొన్న సాగును అత్యధికంగా ప్రోత్సహిస్తోంది. జీరో టిల్లేజ్ వల్ల కలిగే ప్రయోజనాలను వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగకుమార్ వివరించారు.

ప్రయోజనాలివే..

జీరో టిల్లేజ్ పద్ధతిలో మొక్కజొన్న సాగు వల్ల నేలను తయారు చేయడం, భూమిని దున్నుకోవడం వంటివి ఉండవు. సమయం వృథా కాదు. వరి పంట కోసిన తరువాత భూమి ఆరుదలకు వచ్చి తిరిగి దుక్కి దున్ని మొక్కజొన్న పంట విత్తుకోవడానికి 15 నుంచి 20 రోజులు పడుతుంది. దీనివల్ల మొక్కజొన్నకు సీజన్ దాటిపోయే ప్రమాదం ఉంది. ఈ ప్రభావం దిగుబడిపై పడుతుంది. ఈ సమస్యలను జీరో టిల్లేజ్ పద్ధతి ద్వారా అధిగమించవచ్చు.

విత్తనం విత్తడం ఇలా ..

జీరో టిల్లేజ్ పద్ధతిలో మొక్కజొన్న సాగు చేయాలంటే.. కోతలకు ముందు వరిపైరుకు ఆఖరి తడి ఇవ్వకుండా ఆపాలి. భూమిలో విత్తనం మొలకెత్తడానికి అవసరమైన తేమ ఉంటే చాలు. ఒకవేళ తేమ ఆరిపోతే రైతులు తేలికపాటి తడి పెట్టుకోవాలి. తాడు సహాయంతో 4 లేదా 5 సెంటీ మీటర్ల లోతులో లైన్లలో విత్తనాలను పెట్టుకోవాలి. బరువు నేలలైతే వరసల మధ్య 60 సెంటీమీటర్లు, తేలికపాటి నేలలైతే 20 సెంటి మీటర్ల దూరం పాటించాలి.

కలుపు నివారణ ముఖ్యం

నేలను దున్నకుండా సాగుకు దిగడం వల్ల కలుపు సమస్య అధికంగా ఉంటుంది. కలుపు నివారణకు 200 లీటర్ల నీటిలో 5.5 కేజీల అట్రాజిన్ పౌడర్ లేదా 200 లీటర్ల నీటిలో 500 మి.లీ. ప్యారాకాట్ కలిపి పిచికారీ చేయాలి. ఇలా చేయడం వల్ల వరి కొనలు చిగుళ్లు రావు, గడ్డి మొలవకుండా ఉంటుంది. విత్తనం విత్తిన తరువాత ఒకవేళ కలుపు వస్తే ఇదే పద్ధతి పాటించాలి.

ఎరువుల యాజమాన్యం

మొక్కజొన్న సాగుకు ఎకరాకు 96 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్ అందించాలి. నత్రజనిని నాలుగు దఫాలు, పొటాష్‌ను రెండు దఫాలుగా పంటకు నీటి తడులు పెట్టే సమయంలో మొక్క మొదళ్లో వేస్తే సరిపోతుంది. విత్తనాలు విత్తేటప్పుడు పక్కనే చిన్న రంధ్రం చేసి అందులో భాస్వరం, గుళికలు (డీఏపీ రూపంలో) వేసి కప్పాలి. మొక్కలు మొలిచిన 15 నుంచి 20 రోజులకు పైరుపై రెండు శాతం డీఏపీ ద్రావణాన్ని పిచికారీ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి. వీటితో పాటు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి. ఈ విధానం వల్ల రైతులకు ఖర్చు తగ్గడమే కాక, సమయం కూడా ఆదా అవుతుంది.



– బి.నాగకుమార్, ఏడీఏ, చింతలపూడి

క్లుప్తంగా

ఆలయాల అభివృద్ధికి దాతలు సహకరించాలి



అయ్యప్ప ఆలయంలో దాతలను సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేవాలయాల అభివృద్ధికి దాతల సహకారం ముఖ్యమని పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు అన్నారు. పడాలలోని అయ్యప్ప స్వామి ఆలయానికి దాతలు యర్రా సూర్య తేజ్, ఆలేఖ్య దంపతులు రూ.10,116, అదే విధంగా ముత్యాలమ్మ తల్లికి వెండి చీర నిమిత్తం రూ.11,000 ఆదివారం అందజేశారు. దాత చెన్నారెడ్డి సతీష్, అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు నిమ్మల వెంకట స్వామి, ఉపాధ్యక్షుడు సూరపు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి, అన్నదానానికి సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా దాతలను సత్కరించారు. కోశాధికారి దేవరాజ్ రెడ్డి, ముత్యాలమ్మగుడి ఈవో, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాకర్స్ సభ్యులకు సత్కారం



సత్కార కార్యక్రమంలో తాడేపల్లిగూడెం వాకర్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా 201 కేబినెట్ ప్రమాణ స్వీకారోత్సవం ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఎస్‌పీ రవీంద్ర ముఖ్య అతిథిగా ఆదివారం నిడదవోలు లయన్స్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేవీ కృష్ణారావును జిల్లా చీఫ్ కో–ఆర్డినేటర్‌గా, అధ్యక్షుడు కేవీ చలంను జిల్లా సర్వీస్ డైరెక్టర్‌గా, కార్యదర్శి పి.కుమారస్వామిని జిల్లా సర్వీస్ సెక్రటరీగా, వాకర్స్ ఇంటర్నేషనల్ ఛైర్‌పర్సన్ ప్రవా శ్రీనివాస్‌కు జిల్లా డిప్యూటీ గవర్నర్‌గా, మరో జిల్లా డిప్యూటీ గవర్నర్‌గా వనచర్ల నాగేంద్ర ప్రసాద్‌ను ఎంపిక చేశారు. జిల్లా బాధ్యతలు తీసుకున్న పట్టణ ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్‌ను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా పలువురిని సత్కరించారు.

జాతీయ చిత్రలేఖన పోటీల్లో సత్తాచాటిన చిన్నారులు



గుంటూరులో పతకాలు అందుకున్న విద్యార్థులతో సంస్థ డైరెక్టర్ లక్ష్మి

తణుకు అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక శాఖ, క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్తంగా గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈనెల 21న నిర్వహించిన జాతీయస్థాయి చిత్రలేఖన పోటీల్లో తణుకుకు చెందిన శ్రద్ధ మల్టీ కేంద్రం చిత్రలేఖన విభాగం విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. 6వ తరగతి విద్యార్థిని కొయ్యలమూడి ఉత్తిష్ఠ, నర్సరీ విద్యార్థిని చింతలపాటి కృతిక బంగారు పతకాలు, 5వ తరగతి విద్యార్థి జి.శశిధర్ రజిత పతకం సాధించినట్లు సంస్థ డైరెక్టర్ సీహెచ్ వైఎస్ లక్ష్మి తెలిపారు.

ఆకట్టుకున్న చర్మచిత్ర కళా ప్రదర్శన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని కొబ్బరితోట శ్రీదేవి మహంకాళమ్మ తల్లి 43వ వార్షిక జాతర మహోత్సవాలు సందర్భంగా ఆలయం వద్ద ఆదివారం రాత్రి తోట అప్పారావు బృందం వారితో ప్రదర్శించిన చర్మచిత్ర కళా ప్రదర్శన (తోలు బొమ్మలాట) ఆహూతులను ఆకట్టుకుంది. తోటు బొమ్మలాటలో ఆధ్యాత్మిక అంశాలైన ప్రాచీన కళలను ప్రదర్శించారు. అధ్యక్షుడు యెగ్గిన నాగబాబు మాట్లాడుతూ ప్రాచీన కళలకు ఆదరణ తగ్గుతున్న ఈ రోజుల్లో తొలు బొమ్మలాటను నేటి తరానికి పరిచయం చేసేందుకు ఏటా ప్రదర్శిస్తున్నట్టు తెలిపారు. ఈసందర్భంగా కళాకారులను సత్కరించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు యెగ్గిన నాగబాబు వెల్లడించారు.

సమగ్ర పంటల బీమా పథకం అమలుచేయాలి

పెంటపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర పంటల బీమా పథకం అమలుచేసి రైతుల అభ్యున్నతికి పాటుపడాలని మండల అఖిల పక్ష సంఘం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా పెంటపాడు ప్రజాసంఘాల కార్యాలయం వద్ద ఈనెల 26న నిర్వహించనున్న ట్రాక్టర్ల ర్యాలీకి సంబంధించి గోడపత్రికను ఆవిష్కరించారు. కమ్యూనిస్టు నాయకులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ కిసాన్‌మోర్చా పిలుపు మేరకు ఈనెల 26న పిప్పర నుంచి తాడేపల్లిగూడెం వరకు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. శిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, కళింగ లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల తనిఖీలకు నాక్ బృందం

- 23, 24 తేదీల్లో తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిశీలన
- కళాశాల విద్య బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి



తణుకులోని చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన సైకిల్ షెడ్డు

తణుకు టౌన్: రాష్ట్రంలో కళాశాల విద్యను బలోపేతం చేసే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన చర్యలలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేషనల్ ఎసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) తనిఖీలు త్వరితగతిన పూర్తి చేసేందుకు ఉద్దేశించిన నాక్ పీర్ టీమ్ ఈనెల 23, 24 తేదీల్లో రాష్ట్రంలో పర్యటిస్తున్నట్లు జిల్లా ఐడీ కళాశాల ప్రిన్సిపాల్, తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. దేశంలోని డిగ్రీ కళాశాల విద్యకు సంబంధించిన అంశాలను అంచనా వేసి వాటికి సంబంధించిన సిఫార్సులు చేసేందుకు 2005లో నాక్‌ను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ దేశంలోని, రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల పనితీరును 2005, 2013 సంవత్సరాల్లో తనిఖీలు నిర్వహించి కళాశాలల అభివృద్ధికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ద్వారా నిధుల మంజూరుకు కృషి చేసింది. ప్రస్తుతం మూడో విడత నాక్ బృందం తనిఖీల్లో రాష్ట్రంలోనే మొదటిసారిగా తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తనిఖీ చేయనుంది. ఈ సందర్భంగా రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు సూచనల మేరకు అధ్యాపక సిబ్బంది, కళాశాల పూర్వ విద్యార్థులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, దాతలు, కళాశాలకు వసతుల కల్పనలో భాగస్వాములయ్యారు. దీని కోసం మంత్రి కారుమూరి కళాశాల ప్రధాన ఆటస్థలం మెరక పనులు చేపట్టగా, కళాశాల భవనాల ముందు ఆవరణ, ఆట స్థలం మెరక పనులు, సుందరీకరణ పనులను తణుకు పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్తలు మల్లిన రామచంద్రరావు, చిలుకూరి రామకృష్ణ, చిట్టూరి నరేంద్ర, సత్యనారాయణ స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యం తదితరుల సహాయంతో చేపట్టారు. పూర్వ విద్యార్థుల సహాయంతో సైకిల్ షెడ్డును నూతనంగా నిర్మించారు.

నాక్ నిబంధనల మేరకు గతంలో మొత్తం 1000 మార్కులు పరిశీలనకు వచ్చిన సభ్యులే ఇచ్చేవారు. సవరించిన నిబంధనల ప్రకారం ప్రస్తుతం మొత్తం 1000 మార్కులకు 650 మార్కులకు సంబంధించిన అంశాలను కళాశాల ఆన్‌లైన్‌లోనే నాక్‌కు పంపించాలి, మిగిలిన 350 మార్కులను తనిఖీ బృందం తనిఖీల సందర్భంలో పరిశీలించిన అంశాల ఆధారంగా కేటాయిస్తారు. సవరించిన నిబంధనల ప్రకారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు యూజీసీ నిధులు పొందాలంటే నాక్ తనిఖీలు తప్పని సరి. సవరించిన నిబంధనల ప్రకారం మొదటి సారిగా తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తనిఖీ చేయనున్నారు. ప్రస్తుతం సవరించిన నిబంధనల ప్రకారం ఏ గ్రేడ్ వస్తేనే అటానమస్ (స్వయం ప్రతిపత్తి) హోదా వస్తుంది.

గతంలో అటానమస్ హోదా పొందిన కళాశాలలు

2005లో నాక్ మొదటి విడత తనిఖీల్లో భాగంగా కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఒక్క పాలకొల్లు ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాల బీ గ్రేడ్‌ను సాధించి స్వయం ప్రతిపత్తి (స్వయం ప్రతిపత్తి) హోదాను పొందింది. దీని ద్వారా ఆరేళ్ల కాలంలో ఆ కళాశాల అభివృద్ధికి యూజీసీ నుంచి యూజీసీ ద్వారా రూ. 90 లక్షలు మంజూరయ్యాయి. తర్వాత 2013లో న్యాక్ రెండో విడత తనిఖీల్లో తణుకులోని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల బీ ప్లస్ పాయింట్లు సాధించి అటానమస్ హోదా (స్వయం ప్రతిపత్తి) సాధించింది. స్వయం ప్రతిపత్తి హోదా పొందిన కళాశాలలు యూజీసీ ద్వారా కళాశాలల అభివృద్ధికి ఆరేళ్లపాటు నిధులను పొందడంతో పాటు యూజీసీ గుర్తింపు పొందిన కోర్సులతో పాటు స్థానిక వనరులు, ఉపాధి అవకాశాలున్న కొత్త కోర్సులను బోధించే వీలుంటుంది.

నేడు, రేపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాక్ బృందం తనిఖీలు

తణుకు టౌన్: తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఈనెల 23, 24 తేదీల్లో నాక్ అక్రిడిటేషన్ బృందం తనిఖీలను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం, మంగళవారాల్లో కళాశాలలో న్యాక్ బృందం డాక్టర్ షరీఫ్ అహ్మద్ చైర్మన్‌గా తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. మొత్తం ముగ్గురు సభ్యులలో షరీఫ్ అహ్మద్‌తో పాటు డాక్టర్ ఎస్ రంగస్వామి, డాక్టర్ జాస్మిన్ మతియా లగాన్ సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ తనిఖీలలో కళాశాలలో బోధనకు సంబంధించిన అంశాలతో పాటు మౌలిక వసతులు, పాలనా అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి గ్రేడ్‌ను అందజేస్తారని తెలిపారు. కళాశాలకు నాక్ ద్వారా మంచి గ్రేడ్ సాధించాలని అధ్యాపక సిబ్బంది, పూర్వ విద్యార్థులు, దాతలు కృతనిశ్చయంతో పని చేస్తున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు.

అందరి సహకారంతోనే..



న్యాక్ బృందం తనిఖీల ద్వారా మంచి మార్కులతో గ్రేడ్ సాధించి తణుకులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను స్వయం ప్రతిపత్తి గల కళాశాలగా తీర్చిదిద్దాలని అందరి లక్ష్యం. డిగ్రీ కళాశాలల అభివృద్ధికి నిధులను సమకూర్చుకునేందుకు త్వరితగతిన రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలలను తనిఖీలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనితో భాగంగా మొదటగా జిల్లాలోని తణుకు ప్రభుత్వ కళాశాలలో న్యాక్ బృందం తనిఖీలు నిర్వహించనున్నారు.

– జీ చంద్రశేఖర్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్, ఎస్సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తణుకు

అటానమస్ హోదా సాధించాలని కృషి



తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జిల్లాలోనే డిగ్రీ కళాశాలకు ఐడీ గుర్తింపు ఉంది. మూడో విడతలో రాష్ట్రంలోనే మొదటి సారిగా న్యాక్ బృందం తనిఖీలు నిర్వహించనుంది. గతంలో పాలకొల్లులోని అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్‌గా న్యాక్ గుర్తింపు కోసం పని చేసిన అనుభవంతో ఇక్కడ పని చేస్తున్నా. మంచి గ్రేడ్ పాయింట్లు వస్తాయని ఆశిస్తున్నాం.

– డాక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ జిల్లా ఐడీ కళాశాల, ఎస్సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తణుకు

లయన్స్ సేవలు అభినందనీయం



లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం వారి చేస్తున్న సేవలు అభినందనీయమని పట్టణ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పగడాల సూర్యనారాయణ కొనియాడారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో కడకట్ల జనతా ఆసుపత్రి వద్ద ఆదివారం ఉదయం రాజ రాజేశ్వరీ నిడదవోలు కంటి ఆసుపత్రి వారితో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సూర్యనారాయణ మాట్లాడుతూ 1964 నుంచి క్లబ్ అందిస్తున్న సేవలను అభినందించారు. వైద్యులు 87 మందికి కంటి పరీక్షలు చేశారు. 21 మందికి కళ్లజోళ్ల పంపిణీ చేసేందుకు నిర్ణయించారు. 9 మందికి అవసరమైన కంటి శస్త్ర చికిత్సలు నిమిత్తం నిడదవోలు తీసుకువెళ్లారు. క్లబ్ అధ్యక్షుడు సన్నిధి సూర్యనారాయణ మూర్తి, సెక్రటరీ వి.రామ్మోహన్‌రావు, కోశాధికారి చిన్నం జగదీష్, మెంబర్షిప్ ఛైర్మన్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, పచ్చా వెంకటేశ్వరరావు, మదన్‌మోహన్ అగార్వాల్, యర్రా ఆంజనేయలు తదితరులు పర్యవేక్షించారు.

గుమ్మంపాడులో వైద్యశిబిరం



అత్తిలి మండలం గుమ్మంపాడులో వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: లయన్స్‌క్లబ్ ఆఫ్ అత్తిలి ఆధ్వర్యంలో గుమ్మంపాడులో ఆదివారం ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరాన్ని లయన్స్ క్లబ్ మొదటి జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో 121 మందికి నేత్ర పరీక్షలు చేయగా వారిలో 60మందికి కళ్లజోళ్లు అవసరం కాగా, ఐఓఎల్ ఆపరేషన్లకు 34 మందిని గుర్తించారు. దంత వైద్య శిబిరానికి 69 మంది హాజరు కాగా, నలుగురికి పాడైన దంతాలను తొలగించారు. 73 మందికి సుగర్ పరీక్షలు చేశారు. వేమన సోమేశ్వరరావు, యు సంగమేశ్వరరావు ఆర్థిక సహకారంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు యూవీఎస్ భాస్కరరావు, నిమ్మల సూరిబాబు, శింగులూరి శేఖర్, కె సత్యనారాయణ, యాతం రాంబాబు, సర్పంచ్ వేగేశ్న ధనసత్యనారాయణరాజు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అత్తిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన దృశ్యం

అత్తిలి: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం అత్తిలి షాదీఖానాలో నిర్వహించారు. అత్తిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1971–73 సంవత్సరంలో ఇంటర్మీడియెట్ చదివిన మొదటి బ్యాచ్ విద్యార్థులు 50 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ఒకరికొకరు కుటుంబ యోగక్షేమాలను తెలుసుకుని ఆనందంగా గడిపారు. వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్నవారంతా ఈ ఆత్మీయ సమ్మేళనానికి హాజరై చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడినవారు తరచు కలుసుకోవాలని వారు నిర్ణయించుకున్నారు. జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, డాక్టర్ దిరిశాల వరప్రసాద్, చిన్నం లక్ష్మణరావు, నెక్కంటి వెంకట నారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అడవికొలను బస్, సూరంపూడి సీతారామమూర్తి, కృష్ణంరాజు, బి ప్రవీణ్‌రాయ్, నల్లూరి రాంబాబు, వేమారెడ్డి, డాక్టర్ తోలేటి భాస్కరరావు, నిడదవోలు రామకృష్ణ, గోడితి రంగారావు మాట్లాడారు.

రాబోయే ఎన్నికల్లో ధర్మానిదే విజయం



కడియద్దలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: కురుక్షేత్ర యుద్ధంలో అధర్మంపై ధర్మమే విజయం సాధించిందని, ధర్మం పక్షాన నిలిచిన జగన్‌ను రాబోయే ఎన్నికల్లో విజయం వరించనున్నదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని కడియద్దలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ పరిపాలనకు మంచి నిర్వచనం చెప్పిన నాయకుడు సీఎం జగన్ అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందుతున్న పథకాలను చదివి వినిపించారు. అన్ని వర్గాల ప్రజలు, పథకాల లబ్ధిదారులు జగన్ పాలనపై సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. అర్హత ఆధారంగా ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రజలకు న్యాయం జరుగుతుంటే చంద్రబాబు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని అన్నారు. కాపు సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలను దత్తపుత్రుడు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోబోమన్నారు. 11మందిని బలి తీసుకున్నప్పటికీ చంద్రబాబులో పశ్చాత్తాపం కనిపించడం లేదని విమర్శించారు. రాబోయే ఎన్నికలలో ప్రజలు ఎంతో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. చంద్రబాబు తిరిగి రాష్ట్రానికి రాకుండా రాబోయే ఎన్నికల్లో తరిమికొట్టాలని ప్రజల్ని కోరారు. తొలుత గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.21.80లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పి.శేషులత, వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, సర్పంచ్ యాతం కోటీశ్వరి, ఎంపీటీసీలు దారపురెడ్డి దుర్గాదేవి, మార్లపూడి సుబ్బారావు, నార్ని రవికాంతనాగేశ్వరరావు, సర్పంచ్‌లు పిచ్చికల రాజారావు, ములకాల సూర్యారావు, ఉప సర్పంచ్‌లు చిట్టూరి కాశీవిశ్వనాథం, మేణ్ణి రామారావు, సొసైటీ అధ్యక్షుడు వెలిశెట్టి నరేంద్రకుమార్, జడ్డు హరిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ జామి కృష్ణ, తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఎంపీడీవో ఎం.వెంకటేష్, ఏడీఏ పి.మురళీకృష్ణ, పీఆర్ డీఈ వివిఎస్.వేణుగోపాల్, ఏఈ జి.పవన్ కుమార్, ఎలక్ట్రికల్ ఏఈ పరమేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు టి.శేషుబాబు, పవన్ కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి బీవీఎస్ ఆర్.రాజు, సీసీ హేమ, వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, కొండుబోయిన కృపావరం, మండల మహిళా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు కొల్లా విజయలక్ష్మికుమారి, యాతం బూరయ్య, దారపురెడ్డి శ్రీనివాస్, పరిమి వెంకటేశ్వరరావు (భూపయ్య), పాకనాటి తాతాజీ, గట్టిం సాంబయ్య, ములకాల రాంబాబు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి కారుమూరిని కలిసిన జేసీఎస్ కన్వీనర్లు



మంత్రి కారుమూరిని కలిసిన జేసీఎస్ మండల కన్వీనర్లు

తణుకు అర్బన్: జేసీఎస్ మండల కన్వీనర్లు పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా ఉంటూ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అన్నారు. నూతనంగా నియామకం పొందిన జేసీఎస్ మండల కన్వీనర్లు మంత్రి కారుమూరిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తణుకు మునిసిపాలిటీ పరిధి జేసీఎస్ పట్టణ కన్వీనర్‌గా యిండుగపల్లి బలరామకృష్ణ, తణుకు మండల కన్వీనర్‌గా కరిబండి రాజేష్, అత్తిలి మండల కన్వీనర్‌గా పెన్మెత్స రామరాజు, ఇరగవరం మండల కన్వీనర్‌గా మేడపాటి దినేష్‌రెడ్డి నియమితులైనట్లు చెప్పారు. వీరంతా నేరుగా పార్టీ రాష్ట్ర ముఖ్య నేతలతో అనుసంధానంగా పనిచేస్తారని చెప్పారు. సంబంధిత శిక్షణ తీసుకుని గృహ సారథులకు వీరు శిక్షణ ఇస్తారని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణిప్రసాద్, వైఎస్సార్‌సీపీ ఇరగవరం మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మంత్రి కారుమూరిని కలిసిన రేషన్ డీలర్లు

తణుకు అర్బన్: రేషన్ డీలర్లకు ప్రభుత్వం అండగానే ఉంటుందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అన్నారు. తణుకులో నూతనంగా నియామకమైన రేషన్ డీలర్ల సంఘ నాయకులు మంత్రి కారుమూరిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా డీలర్లు పనిచేయాలని సూచించారు.

సంచార వైద్యశాల ద్వారా సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సంచార వైద్యశాల ద్వారా నడవలేని స్థితిలో ఉన్న పది మందికి ఉచితంగా వైద్య సేవలందించారు. వారికి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ బొండాడ వెంకటేశ్వర్లు తణుకు, పాతూరు, వేల్పూరులో పర్యటించి వైద్య సేవలందించినట్లు తెలిపారు. అసోసియేషన్ సభ్యు లు ఎండీ స్వావిహ ఆర్థిక సహాయంతో ఉచితం మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ రాత పరీక్ష

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం నియోజకవర్గ పరిధిలో ఆదివారం కానిస్టేబుల్స్ తొలి దశ రాత పరీక్షలు ప్రారంభమయ్యాయి. 18 సెంటర్లలో 8,840 మంది పరీక్షలు హాజరుకావాల్సి ఉంది. డీఎస్పీ శ్రీనాథ్ పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మూడు గంటల పాటు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు. హాల్ టికెట్‌తో పాటు ఏదైన ఐడీ పత్రం ఉంటేనే పరీక్ష హాలులోకి అనుమతిచ్చేవిధంగా ఏర్పాట్లు చేశామన్నారు.

తణుకులో..

తణుకు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాతపరీక్ష ఆదివారం తణుకులో ప్రశాంతంగా జరిగింది. మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షలో మొత్తం 1,288 మంది అభ్యర్థులకు 1,097 మంది హాజరయ్యారు. పట్టణంలోని ఎస్ఎంవీఆర్ఎం పాలిటెక్నిక్ కళాశాల, శశి జూనియర్ కళాశాల, ఎస్‌కేఎస్‌డీ మహిళా జూనియర్, డిగ్రీ కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. తణుకు పట్టణ సీఐ ముత్యాల సత్యనారాయణ ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలను ఎస్పీ యు.రవిప్రకాష్ పరిశీలించారు.

పేదవర్గాలకు అండగా సీఎం జగన్

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు
- తణుకులో గడపగడపకు మన ప్రభుత్వం



తణుకులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదవర్గాలకు అండగా ఉంటూ సంక్షేమ పథకాలను అందిస్తూ వారిని ఆర్థికంగా ఆదుకుంటున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అన్నారు. తణుకు 18వ వార్డులో ఆదివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి కారుమూరి పాల్గొని మాట్లాడారు. ప్రజాసంకల్పయాత్రలో పేదవర్గాలు అనుభవిస్తున్న కష్టాలను వైఎస్ జగన్ నేరుగా చూసి నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను రూపొందించారని అన్నారు. ఏ గడపలోకి వెళ్లినా ప్రజలు ఎదురొచ్చి జగనన్న ప్రభుత్వాన్ని కొనియాడుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు.

తణుకు మునిసిపాలిటీపై ప్రశంసల జల్లు

తణుకు మునిసిపాలిటీ అందిస్తున్న సేవలు రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలందుకున్నట్టు మంత్రి కారు మూరి అన్నారు. తణుకు మునిసిపాలిటీలో అధికార యంత్రాంగం అందిస్తున్న సేవల కారణంగా మిగిలిన వాటి కన్నా ముందువరసలో ఉందని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో మోడల్ మునిసిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఏఈ రామకిషోర్, వైఎస్సార్‌సీపీ తణుకు పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, తణుకు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, 18వ వార్డు ఇన్‌చార్జ్ సప్పా బలరామకృష్ణ, నాయకులు అభిషేక్, నారాయణ అప్పారావు, సామంతుల అప్పారావు, షేక్ బాజీ, ఝాన్సీ లారెన్స్, కొమ్మోజు రామకృష్ణ పాల్గొన్నారు.